క్లుప్తంగా

నిధులు మంజూరు చేయాలని మంత్రికి వినతి



కేటీఆర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే

దేవరకొండ : దేవరకొండ మున్సిపాలిటీకి నిధులు మంజూరు చేయాలని కోరుతూ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ మంగళవారం హైదరాబాద్‌లో రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. మున్సిపాలిటీ పరిధిలో అంతర్గత సీసీ రోడ్ల మరమ్మతులకు అవసరమైన నిధులు కేటాయించాలని ఆయన వినతిపత్రంలో కోరారు.

రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలి

అడవిదేవులపల్లి : కొత్తగా పాసు బుక్ వచ్చిన రైతులందరూ రైతు బీమా కోసం దరఖాస్తులు చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి జి. అర్చన అన్నారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈనెల 19వ తేదీవరకు పట్టా పొందిన రైతులు కూడా బీమా సౌకర్యం కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తులు చేసుకునే వారు పట్టాదారు పాస్ పుస్తకం, రైతు ఆధార్, నామిని ఆధార్, దరఖాస్తు ఫారం, రైతులు స్వయంగా వచ్చి రైతు బీమా నమోదు చేయించుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఏఈఓలు కె. మహేష్‌నాయక్, రావుల నరేష్ తదితరులున్నారు.

రేపు తైబజార్ వేలం

డిండి : డిండి తైబజార్ వేలం పాట రేపు గ్రామ పంచాయతీ ఆవరణలో ఉదయం 11గంటలకు నిర్వహిస్తున్నట్లు గ్రామ సెక్రటరీ సతీశ్ చంద్ర మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా తైబజార్ వేలం పాటలో పాల్గొనే వారు ముందుగానే రూ.5వేలు చెల్లించాలని, వేలం పాట దక్కని వారికి రూ.500పట్టుకుని మిగతా రూ.4500 తిరిగి ఇవ్వనున్నట్లు తెలిపారు. తైబజార్ వేలం పాట దక్కించుకున్న వారికి ఒక సంవత్సరం పాటు లైసెన్స్ ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. మిగతా వివరాలకు 6303443619 ఫోన్ నెంబర్‌ను సంప్రదించాలన్నారు

ఓబీసీ సెల్ మండల అధ్యక్షుడిగా శ్రీనివాస్

మిర్యాలగూడ : దామరచర్ల ఓబీసీ సెల్ అధ్యక్షుడిగా బత్తుల శ్రీనివాస్ ఎన్నికయ్యారు. ఈమేరకు నల్లగొండ జిల్లా కేంద్రంలో ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పరమేష్ నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ మండలంలో బీసీలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. తన నియామకానికి సహకరించిన ప్రతి ఒక్కరికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దామరచర్ల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు గాజుల శ్రీనివాస్, నాయకులు వెంకటేశ్వర్లు, దుర్గారావు, కోటేశ్వర్‌రావు, గోపి, రవి, ఆంజనేయులు, మహమ్మద్, సద్దాం, కోటి పాల్గొన్నారు.

ఇంటి వద్ద నుంచే మధ్యాహ్న భోజనం



ఇంటి నుంచి తీసుకొచ్చిన మధ్యాహ్న భోజనాన్ని తింటున్న విద్యార్థులు

అడవిదేవులపల్లి : మధ్యాహ్న భోజన కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రెండు రోజులుగా మధ్యాహ్న భోజన ఏజెన్సీ మహిళలు సమ్మె చేస్తున్నారు. దీంతో పాఠశాలలో మధ్యాహ్న భోజనం బంద్ అయింది. అయితే వివిధ ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు గురయ్యారు. మంగళవారం పాఠశాలలో మధ్యాహ్న భోజనం వండకపోవడంతో ఇంటి వద్ద నుంచి తీసుకవచ్చిన కొంత మంది విద్యార్థులు అన్నం తెచ్చుకొని సహా విద్యార్థులకు ఉన్న బాక్స్‌లో కొంత వడ్డించారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనం వండకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విద్యాశాఖాధికారులు స్పందించి పాఠశాలలో మధ్యాహ్న భోజనంను పునః ప్రారంభించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

మిర్యాలగూడ : మండలంలోని కాల్వపల్లి గ్రామ బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్త చింతమల్ల ఎర్రా అనారోగ్యంతో మంగళవారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎన్‌బీఆర్ ఫౌండేషన్ చైర్మన్ నల్లమోతు సిద్దార్థ, జిల్లా రైతు బంధు సమితి అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డిలు ఎర్రా మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు రామరాజు, శ్రీనివాస్, ఎంపీటీసీ సైదులు, ఎంపీటీసీ లింగయ్య, బిక్ష్యానాయక్, షాబొద్దిన్, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

నాబార్డ్‌తో ఆర్థిక స్వావలంబన

- ప్రత్యక్షంగా 12వేలు, పరోక్షంగా 6 వేల మందికి లబ్ధి
- పదిహేనేళ్లలో రూ.6 కోట్ల ఖర్చు
- నేడు నాబార్డు డే



నాబార్డు సహకారంతో రైతులకు స్పింక్లర్లు అందజేస్తున్న ఎమ్మెల్యే (ఫైల్)

దేవరకొండ : దేవరకొండ నియోజకవర్గ పరిధిలో నాబార్డ్(నేషనల్ బ్యాంక్ ఫర్ అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్) సహకారంతో ప్రజలు ఆర్థిక స్వావలంబన సాధిస్తున్నారు. గడిచిన పదిహేనేళ్లలో సుమారు 6వేల హెక్టార్ల రైతుల భూమిని వాటర్‌షెడ్ ప్రాజెక్టుల ద్వారా అభివృద్ధిపరిచారు. వర్షం నీటిని ఒడిసి పట్టి భూగర్భ జలాలను పెంపొందించడంతో పాటు... సుస్థిర వ్యవసాయాన్ని మెరుగుపర్చేందుకు నాబార్డు ఎంతగానో కృషి చేసింది. నాబార్డు సహకారంతో నియోజకవర్గ పరిధిలోని దేవరకొండ, నేరెడుగొమ్ము మండలాల పరిధిలోని 30 గ్రామాల్లో ఆయా రైతులకు సంబంధించిన భూముల్లో సహజ వనరులు, జీవనోపాధులు, వ్యవసాయ ఉత్పత్తి, ఉత్పాదకత పెంపుదల, శిక్షణ వంటి కార్యక్రమాలు చేపట్టారు. దీని ద్వారా సుమారుగా ప్రత్యక్షంగా 12వేలు, పరోక్షంగా 6వేల మంది రైతులు లబ్ధి పొందినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. నాబార్డ్ 42వ డే సందర్భంగా ప్రత్యేక కథనం..

నాబార్డ్ సహకారంతో..

నాబార్డు సహకారంతో నియోజకవర్గ పరిధిలోని ఆయా మండలాల్లో 3 రైతు ఉత్పత్తిదారుల సంఘాలను నిర్వహిస్తున్నారు. వీటిలో సుమారు 1500మంది రైతులు సభ్యులు ఉన్నారు. వ్యవసాయపరమైన ఆర్థిక, హార్థిక సహకారం నాబార్డు అందిస్తుంది. అంతేగా నియోజకవర్గంలో 7 వాటర్ షెడ్ ప్రాంతాల్లో ఊట కుంటలు, రాతి కట్టడం పనులు, చెక్ డ్యామ్‌లు, రైతుల పొలాల్లో వరద కట్టలు, ఫారం పాండ్లు వంటి వివిధ రకాల పనులతో నీటిని వడిచి పట్టి భూగర్భ జలాల పెంపునకు కృషి చేసింది. అంతేగాకుండా రైతులకు వ్యవసాయ పనిముట్లు స్పింకర్లు, స్ప్రేయర్లు, పైపులు, ఇతర వస్తువులు, పందిరి కూరగాయల సాగుకు 80 శాతం వరకు సబ్సిడీని నాబార్డు అందిస్తుంది. జిల్లాలోని దేవరకొండ, నేరెగుడుగొమ్ము మండలాల్లో రైతులకు వాతావరణ మార్పులపై సైతం ఎన్నో అవగాహన కార్యక్రమాలను ఏఆర్‌డీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించింది. అంతేగాక నాబార్డు సహకారంతో ఎంతో మంది రైతులు, పేదలు ఆర్థికంగా బలోపేతమవుతున్నారు.

ఆర్థిక వ్యవస్థ మెరుగుపడింది



నాబార్డు ఆర్థిక సహకారంతో మా కుటుంబ ఆర్థిక వ్యవస్థ మెరుగుపడింది. నాకు తండాలో ఉన్న రెండెకరాల వ్యవసాయ పొలంలో వాటర్‌షెడ్ ప్రొగ్రాంలో భాగంగా పందిరి కూరగాయల సాగుపై అవగాహన కల్పించారు. ఈ ప్రొగ్రాంలో భాగంగా శాశ్వత పందిరి ఆధారిత కూరగాయల సాగును ప్రారంభించాను. వ్యవసాయ పొలంలో బోరు బావి ఏర్పాటుతో పందిరి కూరగాయల సాగు ద్వారా దిగుబడి సాధిస్తున్నాను. నాణ్యతతో కూడిన కూరగాయలను పండిస్తూ ఆర్థికంగా లబ్ధిపొందుతున్నాను. – ఎస్.భీముడు, వెంకట్‌తండా, దేవరకొండ

ఆర్థికంగా నిలదొక్కుకున్నా



నాబార్డు వారి సహకారంతో నేను ఆర్థికంగా నిలదొక్కుకున్నాను. ఫ్యాషన్ డిజైనింగ్, టైలరింగ్ ట్రైనింగ్, మేకింగ్ ప్రొగ్రాంలో నా బార్డు-ఎల్‌ఈడీపీ అడ్వాన్స్ టైలరింగ్‌లో శిక్షణ పొందాను. శిక్షణ పూర్తి చేసుకున్న తర్వాత బ్యాంక్ ద్వారా రుణాన్ని పొందాను. ప్రస్తుతం టైలరింగ్ పనులు చేస్తూనే వచ్చే ఆదాయంతో కుటుంబానికి చేదోడు వాదోడుగా ఉంటున్నాను. అంతేగాకుండా నా తోపాటు మరో ఇద్దరికి టైలరింగ్‌లో శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పిస్తున్నాను. – సునీత, గృహిణి, కొర్రతండా

6వేల హెక్టార్లలో వాటర్‌షెడ్ పనులు



నాబార్డు సహకారంతో దేవరకొండ నియోజకవర్గంలోని దేవరకొండ, నేరెడుగొమ్ము మండలాల్లో ఏఆర్‌డీఎస్ (యాక్షన్ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ) ఆధ్వర్యంలో పదిహేనేళ్లుగా గ్రామీణ, గిరిజన అభివృద్ధిని ప్రోత్సహించేందుకు గాను సంస్థ కృషి చేస్తుంది. గడిచిన పదిహేనేళ్లలో 6వేల హెక్టార్ల రైతుల భూమిని అభివృద్ధి చేశాం. రైతుల జీవనోపాధిని మెరుగుపర్చేందుకు నాబార్డు ద్వారా రుణ సాయం, సబ్సిడీ ద్వారా వ్యవసాయ పరికరాలను అందించాం. అంతేగాకుండా 150 మంది మహిళలకు ఉచితంగా కుట్టు శిక్షణ ఇప్పించాం. ఖాజా ఖైరత్ అలీ, ఏఆర్‌డీఎస్ అధ్యక్షుడు

గిరిజన బాంధవుడు సీఎం కేసీఆర్

- ఎమ్మెల్యే నోముల భగత్



హాలియాలో పోడు పట్టాలను అందజేస్తున్న ఎమ్మెల్యే నోముల భగత్

హాలియా : గిరిజనులకు పోడు పట్టాలు అందించి దశాబ్దాలనాటి సమస్యకు పరిష్కారం చూపిన సీఎం కేసీఆర్ గిరిజన బాంధవుడని నాగార్జున సాగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే నోముల భగత్ అన్నారు. మంగళవారం హాలియా పట్టణంలోని లక్ష్మీనరసింహా గార్డెన్స్‌లో నిర్వహించిన పోడు పట్టాల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అధికారం పోయే సరికి సాగర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ నాయకులకు గిరిజనులు గుర్తొచ్చారన్నారు. ఏడు సార్లు ఎమ్మెల్యేగా 16ఏళ్లుగా మంత్రిగా ఉన్న జానారెడ్డి సాగర్ నియోజకవర్గంలో గిరిజనులకు చేసింది ఏమీలేదని విమర్శించారు. గిరిజన చైతన్య యాత్ర పేరుతో జానా తనయుడు పాదయాత్ర చేయడం విడ్డూరంగా ఉందన్నారు. అనంతరం ట్రైకార్ చైర్మన్ ఇస్లావత్ రాంచందర్‌నాయక్, మిర్యాలగూడ ఆర్డీఓ చెన్నయ్యతో కలిసి ఎమ్మెల్యే నోముల భగత్ నియోజకవర్గంలోని త్రిపురారం, తిరుమలగిరి (సాగర్), పెద్దవూర మండలాలకు చెందిన 1026 మంది గిరిజనులకుగాను రెండు వేల ఎకరాలకు సంబంధించి పాస్ బుక్‌లు అందజేశారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక

తెలంగాణ రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పార్టీ చేపడుతున్న పలు అభివృద్ధి సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నట్లు నాగార్జున సాగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే నోముల భగత్ అన్నారు. మున్సిపాలిటీలోని రెండు, ఆరో వార్డు, మాడుగులపల్లి మండలంలోని అబంగాపురం గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ కార్యకర్తలు మంగళవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే నోముల భగత్ సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భగత్ పార్టీలో చేరిన వారికి బీఆర్‌ఎస్ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. నియోజకవర్గంలోని 72మందికి ఇనాం భూములకు పట్టాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ పెద్దులు, జెడ్పీటీసీ కృష్ణారెడ్డి, పీడీ రాజ్‌కుమార్, జిల్లా డీసీసీబీ డైరెక్టర్ అంజయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ పార్వతమ్మ శంకరయ్య, ఎంపీపీ జయమ్మ, మార్కెట్ చైర్మన్లు వెంకటేశ్వర్లు, చంద్రారెడ్డి, సొసైటీ చైర్మన్లు వెంకట్‌రెడ్డి, జయరాం నాయక్, రాష్ట్ర నాయకులు కర్ణ బ్రహ్మారెడ్డి, బాబురావు నాయక్, బీఆర్‌ఎస్ పార్టీ వివిధ మండలాల అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, నాగయ్య, సత్యపాల్, నరేందర్, పట్టణ అధ్యక్షుడు ముత్యాలు, మాజీ మార్కెట్ చైర్మన్లు మహేందర్‌రెడ్డి, జానయ్య, మాజీ ఎంపీపీ రామచంద్రయ్య, రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు లింగారెడ్డి, పెద్దిరాజు, బిక్షానాయక్, వివిధ మండలాల తహసీల్దార్లు, బీఆర్‌ఎస్ పార్టీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మహిళా నాయకురాలు, కార్యకర్తలు, గిరిజనులు పాల్గొన్నారు.

చెరువును కాపాడాలని ఆందోళన



మట్టి పోసిన ప్రాంతం వద్ద నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

కొండమల్లేపల్లి : చిన్న అడిశర్లపల్లి దొనియాల చెరువులోకి నీళ్ల వచ్చే కాల్వకు అడ్డంగా మట్టి పోశారు. దీంతో నీళ్ల ఎలా వస్తాయని ఆ పరిసర ప్రాంత రైతులు మంగళవారం మట్టి పోయకుండా అడ్డుకుని ఆందోళన చేపట్టారు. వివారల్లోకి వెళ్లితే.. మండలంలోని చిన్నఅడిశర్లపల్లి ఎక్స్ రోడ్డు నుంచి పెండ్లిపాకల వెళ్లే మార్గంలో ఉన్న బ్రిడి ద్వారానే నీళ్ల వెళ్తాయి. అయితే సర్వే నెం. 161లో కొంతమంది ప్రభుత్వ భూమిని కబ్జా చేసుకొని పైకుంటల నుండి వచ్చే నీళ్ల వెళ్లకుండా కొందరు వ్యక్తులు అడ్డంగా మట్టిని పోశారు. ఇలా మట్టిపోయడం వల్ల అక్కడే నీళ్ల నిలిచిపోయే ప్రమాదం ఉందని, చుట్టుపక్కల పొలాలు వర్షాకాలంలో మునిగిపోయే అవకాశం ఉందని చిన్నఅడిశర్లపల్లి గ్రామ సర్పంచ్ గడ్డం శ్రీరాములు, చుట్టుపక్కల రైతులు, గ్రామస్తులు మట్టి పోయకుండా అడ్డుపడ్డారు. అధికార పార్టీకి చెందిన మాజీ సర్పంచ్ ఇటుక బట్టీల వ్యాపారులతో కుమ్మక్కై అక్కడ బట్టీలు ఏర్పాటు చేసుకోవడానికి ప్రోత్సహిస్తునట్లు రైతులు, గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెరువులోకి నీరు వెళ్లే విధంగా మట్టి కుప్పలను తొలగించి వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు ప్రజలు, రైతులు గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో చిన్నఅడిశర్లపల్లి సర్పంచ్ శ్రీరాములు, మల్లయ్య, నరసింహా, కూర సాలయ్య, వెంకన్న, రాజేశ్, వెంకటయ్య, సత్తయ్య పాల్గొన్నారు.

పార్ట్ బీ నుంచి తొలగించాలని ధర్నా



గుర్రంపోడు తహసీల్దార్ కార్యాలయం ఎదుట పాస్‌బుక్కులతో నిరసన తెలుపుతున్న రైతులు

గుర్రంపోడు : మండలంలోని బొల్లారం గ్రామంలోని ప్రభుత్వ భూమి 171 సర్వే నంబర్ మొత్తం పార్ట్‌బీ ఉంచడంతో తాము తీవ్రంగా నష్టపోతున్నామని బొల్లారం గ్రామ రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట వారు తమకు రైతు బంధు అందడంలేదని, పాసుబుక్కులు ఉన్నా ఆన్‌లైన్‌లో లేక క్రయవిక్రయాలు చేసుకోలేకపోతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కొందరి భూమి లేకున్నా అక్రమంగా 2007లో పట్టాలు పొందారనే ఫిర్యాదులతో మొత్తం సర్వే నంబర్‌ను పార్ట్‌బీలో ఉంచడంతో అసలైన రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇటీవల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సర్వే జరిపారని, ఆ నివేదిక ఆధారంగా హక్కులు కల్పించాలని వారు కోరుతున్నారు. 171 సర్వే నంబర్‌లోని 80ఎకరాల ప్రభుత్వ భూమికి గతంలో నాలుగు విడతలుగా జరిగిన భూపంపిణీలో 40 మందికి పట్టాలు ఇవ్వగా ఆ తర్వాత 2007లో అక్రమంగా భూమి లేకుండానే మరో 70 మంది వరకు పట్టాలు ఇచ్చారనే ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల కొంతమంది రైతులు పైరవీలతో పార్ట్‌బీ నుంచి తమ భూములను తొలగించుకుంటున్నారని తెలిసిన రైతులందరూ తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని తమ భూములను పార్ట్‌బీ నుంచి తొలగించాలని వేడుకుంటున్నారు. కొందరికీ మాత్రమే రెవెన్యూ అధికారులు లంచాలు తీసుకుని పార్ట్‌బీ నుంచి తొలగించే ప్రయత్నం చేస్తున్నారని గ్రామ రైతు కామెల్ల రాములు ఆందోళన వ్యక్తం చేశారు. రైతులందరీ భూములు పార్ట్‌బీ నుంచి తొలగించాలని కోరారు. ఈ విషయమై తహసీల్దార్ హాస్సెన్ వివరణ ఇస్తూ మొత్తం సర్వే నెంబర్ ప్రస్తుతానికి పార్ట్‌బీలోనే ఉందని, ఒక్క రైతు భూమి కూడ పార్ట్‌బీ నుంచి తొలిగించడం ఇప్పుడు సాధ్యపడదని అన్నారు.

ఓపెన్ స్కూల్ అడ్మిషన్లు ప్రారంభం

త్రిపురారం : తెలంగాణ ఓపెన్ స్కూల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఓపెన్ స్కూల్‌లో పదో తరగతి, ఇంటర్మీడియెట్‌లో అడ్మిషన్లు స్వీకరిస్తున్నామని త్రిపురారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కోఆర్డినేటర్ కర్నాటి వెంకటేశ్వర్లు, సహాయ కో ఆర్డినేటర్ తీగల వెంకన్న, చెన్నాయిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ లావురి వెంకన్న, సహాయ కోఆర్డీనేటర్ మాలోతు దశరథ నాయక్‌లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అడ్మిషన్ పొందాలనుకుంటే త్రిపురారం, చెన్నాయిపాలెం ఉన్నత పాఠశాలలో పూర్తి వివరాలకు 9603727671, 9849573645 నంబర్‌లనుసంప్రదించాలని తెలిపారు.

కొనసాగుతున్న పంచాయతీ కార్మికుల సమ్మె



దామరచర్లలో అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ కార్మికులు

సాక్షి, నెట్‌వర్క్ : తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె మంగళవారం ఆరో రోజుకు చేరింది. ఈ సందర్భంగా పలు పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు మద్దతు తెలిపి మాట్లాడారు. దామరచర్లలో అంబేడ్కర్ విగ్రహానికి సీఐటీయూ మండల కన్వీనర్ బైరంద దయానంద్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. త్రిపురారంలో సమ్మెకు పంచాయతీ కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు పొలె సాంబయ్య మాట్లాడుతూ ఈ సమ్మెకు పార్టీలు, ప్రజా సంఘాలు, ప్రజలు సహకారించాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నెస్పీ క్యాంపు ఆవరణలో ఉన్న బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. దేవరకొండలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభుడు పల్లా నర్సింహారెడ్డి మద్దతు తెలిపి మాట్లాడారు. చింతపల్లిలో సమ్మె మంగళవారం కొనసాగింది. ఈ సందర్భంగా పలు సంఘాల నాయకులు మద్దతు తెలిపి మాట్లాడారు. తిరుమలగిరి(సాగర్)మండలంలో పంచాయతీ కార్మికులు ర్యాలీ నిర్వహించారు. డిండిలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు నూనె రామస్వామి ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. కొండమల్లేపల్లిలో బీజేపీ మండల అధ్యక్షుడు సాంబశివగౌడ్ మద్దతు తెలిపారు.

బాధితుడికి ఆర్థిక సాయం

వేములపల్లి : కార్యకర్తలకు కాంగ్రెస్ పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని మిర్యాలగూడ కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బీఎల్‌ఆర్ అన్నారు. మండల కేంద్రానికి చెందిన మహమ్మద్ ఆరీఫ్ ఇటీవల మృతిచెందగా ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి రూ.50వేలు పంపగా వాటిని మంగళవారం బీఎల్‌ఆర్ మృతుడి కుటుంబానికి అందజేశారు. అనంతరం మండల కేంద్రంలో సమ్మె చేస్తున్న గ్రామ పంచాయతీ కార్మికులకు ఆయన మద్దతు తెలిపి మాట్లాడారు. ప్రభుత్వం వెంటనే పంచాయతీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పుట్టల సునీత, మాడ్గులపల్లి జెడ్పీటీసీ పుల్లెంల సైదులు, మండల పార్టీ అధ్యక్షుడు మాలి కాంతారెడ్డి, నూకల వేణుగోపాల్‌రెడ్డి, రావు ఎల్లారెడ్డి, తమ్మడబోయిన అర్జున్, రేగట్టె రవీందర్‌రెడ్డి, కృపయ్య, శ్రీను, మధు, వెంకన్న, హాజీ, చంటి, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

పోరాటాల ఫలితమే పోడు భూములకు హక్కు పత్రాలు



మాట్లాడుతున్న కున్‌రెడ్డి నాగిరెడ్డి

హాలియా : రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేస్తున్న పోడు పట్టాలు తెలంగాణ రైతు సంఘం, తెలంగాణ గిరిజన సంఘం, వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాల పోరాట ఫలితమే అని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కున్‌రెడ్డి నాగిరెడ్డి, తెలంగాణ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి కొర్ర శంకర్ నాయక్ అన్నారు. మంగళవారం హాలియా పట్టణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. దశాబ్ద కాలంగా అనేక పోడు ప్రాంతాల్లో తెలంగాణ రైతు సంఘం, తెలంగాణ గిరిజన సంఘం నాయకులు గిరిజనలు ఎదర్కొంటున్న సమస్యలను తెలుసుకొని ఫారెస్టు అధికారులు, ప్రభుత్వంపై పోరాటం నిర్వహించినట్లు తెలిపారు. గిరిజన, రైతు సంఘం నాయకులు చేసిన పోరాట ఫలితం నేడు ఫలించిందన్నారు. గిరిజన రైతులపై, గిరిజన సంఘాల నాయకులపై ఫారెస్టు అధికారులు పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. గ్రామాల్లో ఎక్కువ శాతం గ్రామ ఎఫ్ఆర్సీ కమిటీ స్థాయిలోనే అధికారులకు అవగాహన లేకపోవడంతో దరఖాస్తులను తిరస్కరించారని తద్వారా అర్హులైన పోడు రైతులకు పట్టాలు రాలేదన్నారు. భూమి ఉండి అర్హత కలిగిన పోడు రైతులందరికీ సర్వే చేసి హక్కు పత్రాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కుర్ర రాజు నాయక్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు జటావత్ రవినాయక్, సముద్రాల కృష్ణయ్య, రైతులు తదితరులు ఉన్నారు.

ఘనంగా సీత్లా పండుగ

త్రిపురారం : మండలంలోని కుంకుడు చెట్టు తండా గ్రామ పంచాయతీ పరిధిలోని పెద్ద తండాలో గిరిజనులు మంగళవారం సీత్లా పండుగను అంగరంగ వైభంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ దేవతలకు మొక్కులు చెల్లించుకోని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సేనావత్ ధార్మా నాయక్, సర్దార్ నాయక్, మోతిలాల్, లక్ష్మణ్, బిచ్చా పాల్గొన్నారు.



సీత్లా పండుగలో గిరిజనులు

ఉపాధ్యాయ బదిలీలు చేపట్టాలి

గుర్రంపోడు : ప్రభుత్వం బదిలీలు, ప్రమోషన్‌లు వెంటనే చేపట్టాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వై.సైదులు అన్నారు. మంగళవారం మండలకేంద్రంతోపాటు పిట్టలగూడెం, పోచంపల్లి, కొప్పోలు, తేనపల్లి, కేజీబీవీ, మోడల్ స్కూల్ పాఠశాలల్లో యూటీఎఫ్ సభ్యత్వ నమోదు సందర్భంగా నిర్వహించిన సమావేశాల్లో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పి. శ్యామ్‌కుమార్, నాగయ్య, మధుసూదన్, బి. సైదులు పాల్గొన్నారు.

విరివిగా మొక్కలు నాటాలి

దేవరకొండ : పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ విరివిగా మొక్కలు నాటాలని లిటిల్ ఫ్లవ ర్ అప్పర్ ప్రైమరీ స్కూల్ హెచ్ఎం చేరిపల్లి రాజేశ్ అన్నారు. మంగళవారం పాఠశాలల్లో సేవ్ ది ట్రీ – సేవ్ ది ఎర్త్‌పై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మొక్కల పెంపకం, వాటి వల్ల కలిగే లాభాలను వివరించారు. అనంతరం విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు.

పాఠశాల మూసివేత!

మాడుగులపల్లి: మండలంలోని పూసల పహాడ్ ప్రాథమిక పాఠశాలను మూసివేసేందుకు సూచన ప్రాయంగా నిర్ణయం తీసుకున్నట్లు ఎంఈఓ బాలాజీ నాయక్ మంగళవారం తెలిపారు. పది మందిలోపు విద్యార్థులున్న పాఠశాలలను మూసివేయాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలున్నట్లు ఆయన పేర్కొన్నారు. పాఠశాలకు కేవలం ఐదుగురు విద్యార్థులు మాత్రమే హాజరవుతున్నట్లు విచారణలో గుర్తించామని, ఈ కారణంగానే ఇక్కడ పని చేసే ఇద్దరు ఉపాధ్యాయులను డిప్యుటేషన్‌పై ఇతర పాఠశాలలకు కేటాయించినట్లు వెల్లడించారు. పది మందికంటే ఎక్కువ విద్యార్థులుంటే పాఠశాలను కొనసాగిస్తామని లేకుంటే విద్యార్థులను సమీప పాఠశాలల్లో సర్దు బాటు చేస్తామని వివరించారు. విద్యార్థుల పూర్తి వివరాలు సేకరించాలని సీఆర్పీని ఆదేశించామని వివరాలు రాగానే తుది నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు.

నిరుపేదలకు అండగా బుసిరెడ్డి ఫౌండేషన్



పెద్దవూర : ఆర్థిక సాయం అందిస్తున్న పాండురంగారెడ్డి

పెద్దవూర : నియోజకవర్గంలో నిరుపేదలకు బుసిరెడ్డి ఫౌండేషన్ ఎల్లవేళలా అండగా ఉంటుందని ఫౌండేషన్ చైర్మన్, పారిశ్రామికవేత్త బుసిరెడ్డి పాండురంగారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని తంగెళ్లతండా, పొల్తీతండా, మర్రిపురితండా, ఏనేమీదితండా, రామన్నగూడెంతండా, రామన్నగూడెం గ్రామాలలో ఒక్కొక్కరికి రూ.5వేల చొప్పున 28 మందికి మొత్తం రూ.1.40లక్షలను ఇంటింటికి వెళ్లి పంపిణీ చేశారు. ఇప్పటికే నియోజకవర్గంలో చాలా గ్రామాల్లో తిరిగి నిరుపేదలకు ఆర్థిక సాయం అందించడంతో పాటు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు బ్యాగులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తిరుమలగిరి సాగర్ వైస్ ఎంపీపీ యడవెల్లి దిలీప్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు పులిమాల కృష్ణారావు, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు పొల్తీ చంద్యానాయక్, సర్పంచ్‌లు లింగయ్య, బాణావత్ శంకర్‌నాయక్, పమ్మి జనార్దన్‌రెడ్డి, ప్రభావతిసంజీవరెడ్డి, ఉప సర్పంచ్ మట్టపల్లి ప్రదీప్‌రెడ్డి, జలీల్‌పాషా, శ్రీనాథ్, మహేష్‌యాదవ్, రవినాయక్, అబ్దుల్ కరీం, ముస్తఫా పాల్గొన్నారు.

జనాభా నియంత్రణ అందరి బాధ్యత

మిర్యాలగూడ టౌన్ : జనాభా నియంత్రించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని బంజార ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు మాలోతు దశరతనాయక్, యాదవ సంఘం నాయకులు మురళియాదవ్ అన్నారు. మంగళవారం స్థానిక సుందరయ్య పార్క్‌లో బంజార ఉద్యోగుల సంఘం, యాదవ సంఘం ఆధ్వర్యంలో జనాభా దినోత్సవంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్వర్‌రావు, సురేష్, కార్తీక్, హేమంత్ తదితరులున్నారు.

పెద్దవూర : ప్రపంచ జనాభా దినోత్సవాన్ని మంగళవారం మండల కేంద్రంలో ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ స్లీవమ్మ మాట్లాడుతూ జనాభాలో ప్రస్తుతం ప్రపంచంలోనే భారతదేశం ప్రథమ స్థానానికి చేరిందన్నారు. జనాభా పెరుగుదలను అరికట్టేలా చూడాలని అన్నారు. స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం శ్రీనివాస్, పాల్గొన్నారు.

పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం



రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఎమ్మెల్యే భగత్, నాయకులు

హాలియా : రాష్ట్రంలో ఉచిత విద్యుత్ అవసరం లేదంటూ పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలకు నిరసనగా ఎమ్మెల్యే నోముల భగత్ నాయకత్వంలో మంగళవారం హాలియాలో బీఆర్‌ఎస్ నాయకులు ఆందోళన చేశారు. హాలియా – మిర్యాలగూడ ప్రధాన రహదారిపై నిరసన చేయడంతో వాహనాలు భారీగా నిలిచాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నోముల భగత్ ఆధ్వర్యం లో పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు, నాయకులు, ప్రజా ప్రతినిధులు, రైతులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించిన బర్త్‌డే హంగామా

- పోలీసులు జోక్యంతో ట్రాఫిక్ క్లియర్



కొండమల్లేపల్లి ప్రధాన రహదారిపై ట్రాఫిక్ జామ్

కొండమల్లేపల్లి : కాంగ్రెస్ పార్టీకి చెందిన ఒక యువకుడు చేసిన బర్త్‌డే హంగామా మంగళవారం స్థానిక చౌరస్తా వద్ద సుమారు అరగంట పాటు అంతరాయినిక కారణమైంది. తన పుట్టిన రోజు వేడుకల సందర్భంగా టాప్‌లెస్ వాహనంపై భారీ హంగు ఆర్బాటాలతో వంద బైకులతో ర్యాలీ, బాణాసంచా కాల్చుతూ ర్యాలీగా వెళ్లారు. అనుకోకుండా ఒక్కసారిగా రోడ్డుపైకి వచ్చి తీవ్ర ట్రాఫిక్ తీవ్ర అంతరాయానికి కారణమయ్యారు. దీంతో విసుగు చెందిన ప్రజలు విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. పోలీసులు రంగప్రవేశం చేసి ట్రాఫిక్‌ను క్లియర్ చేయడంతో పాటు ప్రధాన రహదారిపై పుట్టిన రోజు వేడుకలు నిర్వహించి ట్రాఫిక్ అంతరాయానికి కారణమైన యువకుడిని మందలించారు. ఇదిలా ఉంటే ప్రధాన రహదారిపై ట్రాఫిక్ అంతరాయానికి కారణమైన యువకుడిపై పోలీసులు చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

బీసీ రాజకీయ ప్లీనరీ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న బీసీ సంఘం నాయకులు

మిర్యాలగూడ టౌన్ : ఈనెల 15న హైదరాబాద్‌లో నిర్వహించే బీసీ రాజకీయ ప్లీనరీ ప్రచార వాల్ పోస్టర్‌ను మంగళవారం బీసీ సంఘాల ఆధ్వర్యంలో పట్టణంలోని అమరవీరుల స్తూపం వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ తెలంగాణలో మరో నాలుగు నెలల్లో నిర్వహించే అసెంబ్లీ ఎన్నికల్లో బీసీలు రాజకీయంగా అనుసరించాల్సిన విధానంపై ఈ ప్లీనరీలో చర్చించనున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో బీసీ నేత, టీపీసీసీ సభ్యులు కృష్ణయ్య, పట్టణ వెంకటేశ్వర్లు, జయమ్మ, శ్రీనివాస్, నాయకులు బసవయ్య గౌడ్, వెంకటయ్య, శ్రీనివాస్ యాదవ్, గుండు శ్రీరాములు, అంజయ్య, వెంకటేశ్వర్లు, సంధ్యారాణి, మమత తదితరులు పాల్గొన్నారు.